

# దెబ్బకు దెబ్బ

— బమిడి వెంకటేశ్వర్లు

కిటికీలోనుంచి బయటకు చూస్తున్నాడు కాంతారావు. రోడ్డుమీద వాహనాలతోపాటు ఆఫీసులోని సహోద్యోగులు, మిత్రులు ఎందరో బిజీగా ఉండటం రివాజుగా గమనించే దినచర్యే!

"సత్యమూర్తి యింకా రాలేదే" అనుకున్నాడు కాంతారావు. అప్పటికి పదోసారి అలా అనుకోడం. ఇప్పుడతనికి సత్యమూర్తితో పనుంది. కాబట్టి రొటీనుకు భిన్నంగా ప్రవర్తించాలి. గొంతు కూడా తగ్గించుకొని మాట్లాడాలి-ఇదీ అతనికి అలవాటైన విద్యే! అవసరం ఉన్నప్పుడు, పని జరగాలనుకొన్నపుడు కొన్ని టెక్నిక్‌లు ప్రయోగించడం సత్యమూర్తి లాంటి వారు కాంతారావు విషయంలో గమనిస్తారు.

"ఒంటిగంటకల్లా నువ్వు డబ్బు తెచ్చివ్వాలి. నేను రెండు గంటలకు విజయవాడ వెళ్ళి, అట్నుంచి సాయంత్రం బస్సులో విశాఖ వెడతాను. ఈ ప్రోగ్రాంలో మార్పుండదు. మళ్ళీ కథలు ఏవీ వినిపించవద్దు" ఉదయం నల్గొండనుంచి బంధువు ఫోను చేశాడు కాంతారావుకి. ఆ మాటే పదేపదే గుర్తుకొస్తోంది. విసుగొస్తోంది. చిరాకు పెడుతోంది. కాంతారావు జుట్టు పీక్కున్నాడు. పళ్ళుకొరుక్కున్నాడు. గుడ్లు మిటకరించాడు.

ఇప్పుడు ఈ సమస్య నుంచి ఎలా బైటపడాలో!

సత్యమూర్తి ఎలా ప్రవర్తిస్తాడో.

కాంతారావుని ఆలోచనలు తరుముతున్నాయి.

అంతలోనే వచ్చాడు సత్యమూర్తి!

గట్టిగా ఊపిరి పీల్చాడు కాంతారావు అతన్ని చూసి!

"ఏమయ్యా.. ఇప్పుడా రావడం.. ఇందాకట్నుంచి నీకోసం కళ్ళుకాయలు కాస్తున్నాయి..." అంటూ పలకరించాడు.

సత్యమూర్తికి విషయం బోధపడింది "ములగచెట్టు ఎక్కించకు మహానుభావా..." అంటూ నవ్వేశాడు.

"పద... క్యాంటీనుకెళ్ళి కాఫీ తాగుదాం" అంటూ లేచాడు కాంతారావు. సత్యమూర్తికి ఆశ్చర్యం వేసింది. "నువ్వు పాల వాడివికదా.. కాఫీవాడివి కాదుగా" అన్నాడు.

"నిజమేననుకో.. కానీ, నీకు కాఫీ నేను యిప్పిస్తాను నువ్వు తాగాలి" అంటూ భుజం మీద చేయి వేశాడు—బయలుదేరమన్నట్లుగా.

సత్యమూర్తికి ఇప్పుడు విషయం బాగా అర్థమైంది. "ఏటో పనుందీ మానవుడికి తనతో" అనుకుంటూ "ఏమిటి ఈవేళ పట్టు పరిశ్రమ నా మీద ప్రయోగిస్తున్నావు" అన్నాడు నవ్వుతూ.

మరో సందర్భంలో అయితే కాంతారావు విరుచుకుపడేవాడు. కాని యిప్పుడు అవసరం తనది. కాబట్టి తాను వసుదేవుడు కావాల్సిందే మరి! ఫోను విషయం ప్రస్తావించాడు అతను.

"నాకెందుకు చెప్పడం.. నేను అప్పు యివ్వాలా.. నువ్వే పెద్ద సైజుకు చెరుమిడివి" అన్నాడు సత్యమూర్తి నవ్వుతూ.

ఎలా చెప్పాలో మనసులో మాట! అనుకుంటున్నాడతను. "నల్గొండ బస్సులో వెళ్ళడానికి టైములేదు... అందుకని... అంటూ సంశయించాడు కాంతారావు.

సత్యమూర్తికి నవ్వొచ్చింది. "నల్గొండ వెళ్ళేందుకు బోలెడు బస్సులు, పైగా దగ్గరే. టిక్కెట్టు కూడా తక్కువే" అన్నాడు.

"నిజమే.. కాని పదిహేనువేలు బస్సులో ఎలా తీసుకెళ్ళడం! రోజులు బాగా లేవు... బస్సాపి, దోపిడీలు జరుగుతున్న రోజులు..' కాంతారావు అసలు విషయాన్ని చెప్పాడు.

"అయితే టాక్సీమీద వెళ్ళి ఇచ్చేసిరా.. స్వామికార్యం స్వకార్యం జరుగుతుంది..." సలహా ఇచ్చాడు సత్యమూర్తి.

"టాక్సీవాడు వూరికే తీసుకెడతాడా"

"అయితే నేనేంచేయాలి"

'నువ్వేం చేయక్కర్లేదు... నీ స్కూటరు ఇస్తే, నల్గొండ వెళ్ళి వస్తాను" అనేసి గట్టిగా వూపిరి పీల్చుకున్నాడు కాంతారావు.

"నేను స్కూటరు ఇవ్వనని తెలిసే అడగడం బాగోలేదు" అన్నాడు సత్యమూర్తి.

'నిజమే... కానీ ఇప్పుడు అర్జంటు పనికదా! పైగా వ్యవధి లేదు. అయినా నాకు లైసెన్సు ఉంది... పైగా ఈ మధ్య బాగా నేర్చుకున్నాను. కోఠి, అబిడ్సు, బషీర్‌బాగ్, పంజాగుట్ట, సనత్‌నగర్, బేగంపేట రోడ్లమీద బాగానే నడిపానని ఇద్దరు ముగురు స్నేహితులు చెప్పారు కూడా"

"అయితే వాళ్ళ స్కూటరే తీసుకెళ్ళు. నన్నెందుకు అడగటం" అన్నాడు సత్యమూర్తి నిశ్చయంగా.

"వాళ్ళు వూరికెళ్ళారు.." అని అబద్ధం చెప్పాడు.

సత్యమూర్తి నమ్మితే కదా!

కొంచెం సేపయ్యాక అన్నాడు సత్యమూర్తి "నేను కూడా లాభం లేకుండా ఏ పని చేయకూడదని నిర్ణయించుకున్నాను. అఫ్‌కోర్సు, డబ్బు విషయంలో— సొంతలాభం కూడా చూసుకోవాలని— నేను కూడా ఆలోచిస్తున్నాను.." అని

'ఈసారికి స్కూటర్ ఇచ్చి పుణ్యం కట్టుకో.. నా పరిస్థితిని అర్థం చేసుకో..." దీనంగా అడిగాడు కాంతారావు.

"కావాలంటే నేను వెళ్ళి డబ్బు ఇచ్చివస్తాను"

"అయితే ఇద్దరం వెడదాం. డబ్బుకు ఇద్దరం కాపలా... స్కూటర్‌ని ఇద్దరూ శ్రమలేకుండా నడపవచ్చు.." అన్నాడు కాంతారావు వీరలెవెల్లో.

"అసలే ఈవేళ సెక్షన్‌లో మనం ఇద్దరమే వచ్చాం.

ఇప్పుడు ఇద్దరూ చెక్కేస్తే— ఎవరకైనా తెలిస్తే ప్రమాదం... అయినా నా స్కూటర్ మీద మా ఆవిడ, పిల్లల్ని తప్ప ఎవరినీ కూర్చోబెట్టుకోవడం నాకిష్టం ఉండదు" తేల్చి చెప్పేశాడు సత్యమూర్తి.

కాంతారావు ఆలోచించేది వేరు.

ఆ విషయం సత్యమూర్తికి తెలుసు.

"నువ్వు ఇచ్చిన డబ్బుకు నేను చెక్కు ఇస్తాను, నీ భయం నాకు తెలుసు కాబట్టి... స్కూటర్‌లో ఐదు లీటర్ల పెట్రోలు కొట్టించు... టిఫిన్, కాఫీ ఖర్చుల నిమిత్తం పాతిక రూపాయలు ఇవ్వాలి. పైగా నీ పని చేసిపెట్టినందుకు మూడొందలు ఇవ్వాలి... ఆలోచించుకొని పావు గంటలో చెబితే నేను బయలుదేరుతాను. లేదంటే మరొకరిని చూసుకో" అన్నాడు సత్యమూర్తి.

కాంతారావు ఖంగుతిన్నాడు.

ఈ పథకం బాగానే ఉంది. కాని చాలా వరకు తనకే నష్టం! కానైతే, మరో దారి కనిపించడం లేదు.

★ ★ ★

కాంతారావు గొప్ప వ్యక్తి. ఎవరితో ఎలా మాట్లాడాలో, ఎలా వ్యవహరించాలో తెలిసిన రాజకీయుడు. పన్నెండేళ్ళ ఉద్యోగజీవితంలో ఏ రెండుమూడు సార్లో బాల్‌పెన్నులో రీఫిల్సు

మార్చి ఉంటాడు. అతనికి పబ్లిక్ రిలేషన్లు ఎక్కువ. పైగా ఆడాళ్ళమీద వల్లమాలిన "ఇది". తరచు వాళ్ళు కావలిసిన పనులు చేసి పెడుతుంటాడు. వారి అవసరాలు ఎటువంటివైనా ముందుకెడతాడు. తన సీటులో పనేమిటో ఇంత వరకూ తెలియదు, చేయలేదు. ఇతరులని బతిమిలాడి, డబ్బులిచ్చి పనిచేయించేసుకుంటాడు. ఆఫీసులోని అంతస్తులు, మెట్లు, లిఫ్టులు, కుర్చీలు, టేబుళ్ళు, ర్యాక్‌లు, బాత్‌రూమ్‌లు వగైరా వివరాలను చిన్నసైజు ఎన్‌సైక్లోపీడియాలా చెప్పగలడు. ఇక ఆఫీసర్లకు ఇంటిపనులు, బజారుపనులు తన బాధ్యతగా స్వీకరిస్తాడు. అతనికి తెలిసిందల్లా చాలా తక్కువ పనులే. అటెండెన్సు రిజిస్టరులో సంతకం చేయడం, నెలవగానే జీతం తీసుకోవడం, అడిగినవారికి ఉచిత సలహాలివ్వడం అడగనివారికి రాజకీయాలు నేర్పడం హాబీలు.

"ఈ ఆఫీసులో ఎంతమంది పనిచేస్తున్నారు"అని చాలామంది కాంతారావుని అడిగితే.

'మహావుంటే ఓ రెండొందలు" అంటాడు.

అడిగినవాళ్ళు షాక్ తింటారు "అయిదంతస్తుల భవనాలలో ఇంత విశాలంగా ఉన్న ఆవరణలో రెండొందలేనా" అని మళ్ళీ ఎదురు ప్రశ్నిస్తే.

"జీతం తీసుకోవడానికైతే ఏడువేలుంటారు. ఎవరు ఎందుకు పనిచేస్తారు... గవర్నమెంటు ఆఫీసులు కదా.. గదుల్లో కూర్చునే అధికారులు ఏంచేస్తున్నారని... అలాగే కింద ఉద్యోగులు కూడా... ఎవరికి వారు తన జీతం గురించి ఆలోచించడం తప్పించి, పని గురించి బాధ్యత వహించరు. పైగా ఇది కొత్త శతాబ్దిలోకి అడుగుపెట్టినకాలం..." అంటూ కాశీమజిలీ లెవెల్లో కథలు చెబుతాడు.

"పోనీ మీరైనా పనిచేస్తారా" అని అడిగిన వాళ్ళూ లేకపోలేదు.

"నిజం చెప్పొద్దూ... నేను పనిచేయను, చేతకాదు, నేను చాలావరకు చెప్పే నిజాల్లో ఇదొకటి.. పనిచేయకుండా తిరిగేవారిని చూశాక, నేను కూడా ఈ ఫార్ములా ఫాలో అవుతున్నా... ఇంకా ఏమైనా అడుగుతారా... ఇప్పుడు నేను మా ఆఫీసరు గారింటికి వెళ్ళి బజారు పనులు చూడాలి.... ఆ తరువాత బాత్‌రూములోకి నీళ్ళు వచ్చేలా చూడాలి.. ప్లంబరు దగ్గరికి వెళ్ళాలి..." అనేస్తాడు కాంతారావు.

చివరి మాటలు వినగానే అడిగేందుకు ప్రశ్నలు ఎలా ఉంటాయో, జవాబులు కూడా అలాగే ఉంటాయనేది సత్యం.

అటువంటి సమయంలో అతనికి సత్యమూర్తితో పరిచయం అయింది. అతని అనుభవాన్ని, వయసుని తను రాజకీయంగా మలచుకొని సుడిగాలిలా దూసుకువెళ్ళిపోసాగాడు. మరో విధంగా చెప్పాలంటే కాంతారావుకి సిన్సియారిటీ లేదనాలి. సుపీరియారిటీ కాంప్లెక్సు మాత్రం టన్నులకొద్దీ ఉంది.

"ఇది పద్ధతి కాదు.. కనీసం రోజులో గంటైనా పని చేయవచ్చుగా"అనేవాడు సత్యమూర్తి.

"నీకు సన్మానం చేయిస్తాను.. పనులు, బాధ్యతలు, విలువలు గురించి ఉపన్యాసం ఇద్దువుగాని... ఓ వెయ్యి కొట్టించు" అనేవాడు కాంతారావు.

"డబ్బిచ్చి సన్మానం చేయించుకోవలసిన దురద నాకేంలేదు. అంత ఆముదమూ లేదు... మైకులు పట్టుకుని సుత్తికొట్టడం నాకు ఇష్టం ఉండదు. ఆ 'మైకాసురుడు' బిరుదు నీకే చెల్లింది" సత్యమూర్తి నవ్వుతూనే అంటించేవాడు.

ఇలా ఉండేది వారి మధ్య వ్యవహారం.

★ ★ ★

పదకొండు గంటలు అవుతోంది టైము.

"సరే... అయితే... నీ షరతులకు అంగీకరిస్తున్నాను. ఇదిగో పెట్రోలుకు డబ్బు. నీకివ్వాల్సిన డబ్బు మూడొందలు రాగానే ఇస్తాను. ఈ డబ్బు పదిహేనువేలు వారికి అందించి, అందినట్లుగా కాగితం రాయించి తీసుకురావాలి. ఒంటిగంటకు ఓ అరగంట ముందే నువ్వు అక్కడ ఉండాలి. దారిలో పంచరు పడినా, మరో ప్రాబ్లెం వచ్చినా నాకు అనవసరం... అటువంటి సాకులు నాకు నచ్చవు... పదహారు వేలకు నువ్వు చెక్కు ఇవ్వాలి" అంటూ వివరంగా చెప్పాడు కాంతారావు.



"పదహారువేలా.. ఇచ్చింది పదిహేను వేలే కదా".

"నిజమే... నువ్వు నల్గొండ చేరేసరికి ఆలస్యమైతే, మా వాళ్ళు వెళ్ళిపోతే నేను నష్టపోతాను కదా.. మరి నా జాగ్రత్త నేను పడాలి కదా..." అంటూ నవ్వేశాడు కాంతారావు.

"రోడ్డు బాగానే ఉంది కదా".

"విజయవాడ రోడ్డు ఎలా ఉంటుందో నీకు తెలీదా!

"ఊళ్ళోకి ఎంతదూరం వెళ్ళాలి"

"నాలుగు కిలోమీటర్లు"

"ఆ రోడ్డు బాగానే ఉంటుంది కదా.."

"ఎందుకు బాగుండదు" అని మాత్రం అన్నాడు కాంతారావు. కాని, ఆ రోడ్డు కంకర రోడ్డు స్కూటరు ఎంత జాగ్రత్తగా నెమ్మదిగా నడిపినా టైముకు చేరడం అలా ఉంచితే, పంచరు పడటం ఖాయం. అతని దృష్టి "పదహారు" వేల మీదుంది. సత్యమూర్తిని ఎలాగైనా దెబ్బతీయాలని లిటిగెంటుగా ఆలోచించి, క్రిమినల్ బ్రెయిన్‌ని పదును పెట్టాడు కాంతారావు.

"నాకు ఎటువంటి డబ్బు వద్దు. నీకు ఏదోలా సాయం చేసి పెడతాను. సమయానికి ఉపకారం చేయడం నా పద్ధతి" అన్నాడు సత్యమూర్తి.

తనకు కలిగే లాభం గురించే ఆలోచించసాగాడు.

అందుకే "కంకరరోడ్డు" విషయం బైటపెట్టలేదు కాంతారావు.

★ ★ ★

సత్యమూర్తి నల్గొండ చేరేసరికి పన్నెండున్నరయింది. మరో పదిహేను నిముషాలకు ఇల్లు చేరాడు. కాంతారావు "కంకరరోడ్డు" గురించి ఎందుకు చెప్పలేదో అర్థమైందతనికి. డబ్బు ఇచ్చేసి, రసీదు అందుకున్నాడు తను. "అతనికి థ్యాంక్స్ చెప్పు" అన్నాడు అవతలి వ్యక్తి పైగా ఇలా కూడా అన్నాడు" అతనేమైనా మారాడా.. వ్యవహారాలు అలాగే నడుపుతున్నాడా" అని.

కాంతారావు గురించి చెడుగా చెప్పడం సత్యమూర్తికి ఇష్టం లేదు.

నల్గొండలో అరగంట ఆగి బయలుదేరాడు సత్యమూర్తి. మూడున్నరకి ఆఫీసు ఆవరణలోకి అడుగుపెట్టాడు. సెక్షన్‌లో కెళ్ళేసరికి మరో పది నిమిషాలు పట్టింది. ఎదురుగా కనిపించాడు కాంతారావు.

"రావయ్యా... ఇంత ఆలస్యం అయిందేమిటి.. వెళ్ళిన పని ఏమైంది.. అంటూ ప్రశ్నించాడు కాంతారావు.

"మరీ రాజకీయ నాయకుడిలా అర్థం పర్థం లేకుండా మాట్లాడకు... నీకు అసలు మంచీమర్యాద లేదు. కాసేపైనా రెస్టు తీసుకోకుండా వస్తే ఏమిటా ప్రశ్నలు" అంటూ మందలించాడు సత్యమూర్తి. ఆ తరువాత రసీదు ఇచ్చాడు.

అది చూసి అవాక్కయిపోయాడు కాంతారావు "పదిహేను వేలు ఇస్తే రశీదు పదివేలకే ఇచ్చేడేమిటి'అని లేచాడు.

"తొందరపడకు. ఇచ్చిన డబ్బుకే రసీదు"

"మిగిలిన అయిదువేలు ఇవ్వలేదా"

"లేదు"

"ఎందుకు"

"నా అవసరానికి ఉంచుకొన్నాను"

"అలా ఎందుకు చేసినట్లు"

"ఓసారి గుర్తు చేసుకోవయ్యా... గతంలో ఓ ఫ్రెండ్‌కు ఇమ్మని నీకు మూడువేలిస్తే, నాడు కుని ఆరునెలలకు ఇచ్చావు. ఇప్పుడు నేను కనీసం పదివేలైనా ఇచ్చాను. మిగిలినది మూడు నాలుగునెలల్లో ఇస్తాలే భయపడకు..." అన్నాడు సత్యమూర్తి.

షాక్ తిన్నాడు కాంతారావు. అతని దృష్టి మిగిలిన డబ్బు మీద ఉంది. తనదే డబ్బు... ఎదుటివారివి చిల్లపెంకులు అనుకుంటే ఫలితం ఇలాగే ఉంటుందనిపించింది అతనికి. ●